క్లుప్తంగా

తొలి రోజు మూడు నామినేషన్లు దాఖలు

మండపేట: మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకరణ తొలిరోజు గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి ఎల్లారావు తెలిపారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, నవతరం పార్టీ అభ్యర్థి నందికోళ్ల రాజు వీల్‌చైర్‌పై వచ్చి నామినేషన్ వేశారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నిర్వహణ కార్యాలయం పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

మండపేట: పట్టణంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని స్థానిక బురుగుంట చెరువు వద్ద ఉన్న సీతారామ క్షేత్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు మరింగంటి వరదాచార్యులు ఆధ్వర్యంలో పూజారులు పట్టాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా హోమాలు, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన నవరాత్రి వేడుకలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో వసంత నవరాత్రి వేడుకలు గురువారం ముగిశాయి. ఈ నెల 9న ప్రారంభమైన ఈ వేడుకలు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, సూర్యరాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగాయి. అమ్మవారికి ప్రతి రోజు కుంకుమార్చనలు, చతుర్వేద స్వస్తి, మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. చైత్ర శుద్ధ దశమిని పురస్కరించుకుని అమ్మవారికి హోమం, పూర్ణాహుతితో వసంత నవరాత్రి వేడుకలు ముగించారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రపురం: పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి గురువారం ప్రారంభించారు. ఎండల తీవ్రత తగ్గేవరకూ ఈ చలివేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, తొగరు సుబ్బారావు, తొగరు ఆదిత్య కుమార్, కోన రామారావు మున్సిపల్ కౌన్సిలర్లు భావాలు భద్రరావు, పామర్తి మధు, అమలదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగులో చివరి దశ కీలకమే

కాజులూరు: వరి సాగులో నారు పోసినప్పటి నుంచి పంట మాసూళ్లు చేసి, గింజలు ఒడ్డుకి చేర్చే వరకూ అన్ని దశలూ కీలకమైనవేనని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో పొలాలను పరిశీలించి, క్షేత్ర స్థాయిలో రైతులకు ఆయన పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో వరి పంట గింజ గట్టిపడే దశ నుంచి, మాసూళ్ల దశకు చేరువలో ఉందన్నారు. 15 నుంచి 20 రోజుల్లో కోత కోసే పరిస్థితి ఉండడంతో కొందరు రైతులు పంటలను అంతగా పట్టించుకోరని, ఈ దశలోనూ పంటపై తెగుళ్లు సోకితే గింజ తేలికగా మారి, దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ చివరి దశలోనూ రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తెగుళ్లను గమనించాలని చెప్పారు. అవసరమైతే వ్యవసాయాధికారులను సంప్రదించి, మందులు వాడాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కె.గంగవరం: శివల సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజనల్ ఈఈ వై. విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సబ్ స్టేషన్ పరిధిలోని శివల, దంగేరు, మసకపల్లి, భట్లపాలిక, తాళ్లపోడు, బాలాంత్రం, యర్రపోతవరం, గుడిగళ్ల భాగ, పేకేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రాయవరం: లైన్ల మరమ్మతుల నేపథ్యంలో రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజనల్ డీఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం నుంచి రాయవరం విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీఏ ఫీడర్, అలాగే రామచంద్రపురం నుంచి ఏడిదకు విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీఏ ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ట్రీ కటింగ్, విద్యుత్ స్తంభాల మార్పులు వంటివి చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పసలపూడి, సోమేశ్వరం, రాయవరం, మహేంద్రవాడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు

మండపేట: ఓ దాడి కేసులో ముగ్గురికి రిమాండు విధించినట్టు పట్టణ అదనపు ఎస్సై ఎల్ నాంచారయ్య తెలిపారు. గురువారం ఆయన మీడియాకు వివరాలు చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రం నుంచి దయాచంద్ అనే వ్యక్తి మండపేటకు వలస వచ్చి చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. అతని దుకాణం వద్దకు వచ్చి పట్టణానికి చెందిన మందపల్లి డేనియల్, కోడూరి మణికంఠ, వీరి మహేష్ అనే యువకులు గొడవకు దిగి, దయాచంద్‌పై దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ షేక్ అఖిల్‌జమ ఆదేశాలతో పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి, ఆలమూరు కోర్టుకు తరలించారు. నిందితులకు న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడు కాగా, అతడిపై రౌడీషీట్ కూడా ఉన్నట్టు అదనపు ఎస్సై నాంచారయ్య చెప్పారు.

అట్టహాసంగా సూర్యప్రకాశ్ నామినేషన్

- ఎంపీ బోస్, ఎమ్మెల్సీ త్రిమూర్తులు హాజరు
- సూర్యప్రకాశ్‌ను గెలిపించండి : ఎమ్మెల్సీ త్రిమూర్తులు పిలుపు



రామచంద్రపురం రిట్నరింగ్ అధికారి సుధాసాగర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న సూర్యప్రకాశ్, చిత్రంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

రామచంద్రపురం: నామినేషన్ల పర్వం మొదలైన తొలి రోజునే రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాశ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తండ్రి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ ఎన్నికల పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు వెంట రాగా, రెండు సెట్ల నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎస్ సుధాసాగర్‌కు అందజేశారు. రిట్నరింగ్ అధికారి సుధాసాగర్ ఎన్నికల నియమావళి పత్రాలను సూర్యప్రకాశ్‌కు అందజేశారు. కాగా ఎంపీ బోస్ ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

సూర్యప్రకాశ్‌ను గెలిపించండి

రామచంద్రపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిల్లి సూర్యప్రకాశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు నిచ్చారు. సూర్యప్రకాశ్ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన త్రిమూర్తులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆగకుండా అమలు జరగాలంటే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేడు(శుక్రవారం) కాకినాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రలో భాగంగా



కె.గంగవరం నుంచి ఉత్సాహంగా తరలివెళ్తున్న పార్టీ నాయకులు

జరుగుతున్న మేమంతా సిద్ధం సభలో పాల్గొని ఆయనకు మద్దతు పలకాలని, సభను విజయవంతం చేయాలని త్రిమూర్తులు పిలుపు నిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

కె.గంగవరం: వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని 26 గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి మోటారు సైకిళ్లపై కె.గంగవరం చేరుకుని, అక్కడి నుంచి ద్రాక్షారామ బయలుదేరి వెళ్లారు. కె.గంగవరం నుంచి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్ ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి మండల ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలే ఎమ్మెల్యేగా సూర్య ప్రకాష్‌ను గెలిపిస్తాయన్నారు. పార్టీ నాయకులు జుత్తక శ్యాంప్రసాద్, కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, కాపు నాయకులు తాడాల సోమశేఖర్ పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హోరెత్తిన అభిమానుల ర్యాలీ

- స్వగ్రామం నుంచి వేలాదిగా తరలిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



కిక్కిరిసిన అభిమానులతో సాగుతున్న పిల్లి సూర్యప్రకాశ్ నామినేషన్ ర్యాలీ

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ నామినేషన్ వేసేందుకు స్వగ్రామం హసన్‌బాద నుంచి గురువారం మోటారు సైకిళ్ల ర్యాలీతో బయలుదేరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో పాటు వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో ర్యాలీ కొనసాగగా, జై జగన్ నినాదాలు హోరెత్తాయి. కందులపాలెం వేంకటేశ్వరస్వామిని, మామిడాడ సూర్యనారాయణ స్వామిని, ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని సూర్యప్రకాశ్ దర్శించుకున్నారు. అలాగే మార్గంలోని చర్చిలు, మసీదులు, దేవాలయాల వద్ద ఆయా మత పెద్దల ఆశీస్సులు అందుకుంటూ ర్యాలీని కొనసాగించారు. రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్ వద్ద అభిమానులు, పార్టీ శ్రేణులు కొద్దిసేపు సందడి చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, వనుము వెంకటసుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాతా భారతి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి

– యువనేత తోట పృథ్వీరాజ్



మండపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పృథ్వీరాజ్

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. గురువారం స్థానిక పెద్ద కాలువ వంతెన వద్ద నుంచి రెండో వార్డ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటరీ వ్యవస్థలను చంద్రబాబు రద్దు చేస్తానని మొదట ప్రకటించి, ఇప్పుడేమో కొనసాగిస్తానని చెప్పడం ఆయన రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మొత్తం పథకాలన్నీ రద్దు చేస్తారని, అందువల్ల ప్రజలంతా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కౌన్సిలర్ చిత్తూరు సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రచారంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు సవరపు సతీష్, పోతంశెట్టి ప్రసాద్, మెండు బాపిరాజు, గ్రంధి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరం బాపిరాజు, టేకుమూడి శ్రీనివాస్, నాగులపల్లి ఈశ్వరరావు, చంద్రమళ్ల లాజర్, చావా సతీష్‌చౌదరి, పితాపురం సత్యనారాయణ, సుందరపల్లి వెంకటరత్నం, పెంకే వెంకట్రావు, సన్నాన ధనరాజు, కోణాల బోస్, తణుకు అశోక్, సాధనాల శివ, బేసి మహాలక్ష్మి, జుత్తుక లీలావతి, బాణాల మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణలో జగనన్నకు తిరుగులేదు



పిల్లి సూర్యప్రకాశ్ నామినేషన్ కార్యక్రమానికి గొల్లపాలెం నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాదరణలో తిరుగులేదని వైఎస్సార్ సీపీ నేత, గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ అన్నారు. గురువారం రామచంద్రపురంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఎన్నికల నామినేషన్ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో కుల, మతాలకతీతంగా అన్ని పార్టీల వారికి లబ్ధి చేకూరిందన్నారు. మంచి జరిగిందని నమ్మితేనే ఓటు వెయ్యండన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనను జనం స్వాగతిస్తున్నారన్నారు. దేశ చరిత్రలోనే ఇప్పటి వరకూ ఇంత ధైర్యంగా ఓటు అడిగింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పార్టీ నాయకులు మాదిరెడ్డి పృథ్వీరాజ్, టేకుమూడి దుర్గారావు, దంగేటి వెంకన్న, నిమ్మితి విజయ్, పెంటపాటి శ్రీను పాల్గొన్నారు.

తోట విజయం ఖాయం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పాపారాయుడు



మండపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తోట త్రిమూర్తులు నామినేషన్ వేస్తారని, ఈ ఎన్నికల్లో తోట విజయం తథ్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తోట పోటీ చేయరని ఎన్డీఏ మిత్ర కూటమి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ప్రజలు తమ తీర్పును ఓటు ద్వారా బహిర్గతం చేస్తారని, గతంలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత ఆయనకుందన్నారు. నియోజకవర్గ ప్రజలు త్రిమూర్తులుపై చూపిస్తున్న ఆదరణకు విపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. విపక్షం ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా ప్రజా నాయకుడు తోట త్రిమూర్తులు మాత్రమే గెలుస్తారన్నారు. నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి పనులకు, సమర్థ నాయకత్వానికి ప్రజాదరణ కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రజలంతా మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో తిరుగులేని విజయంతో ఏర్పాటు చేయబోయే జగన్ ప్రభుత్వంలో తోట అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయమని పాపారాయుడు ధీమా వ్యక్తం చేశారు.

డీవైఈఓగా సూర్యప్రకాశం

అమలాపురం రూరల్: అమలాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా(డీవైఈఓ) గుబ్బల సూర్యప్రకాశం నియమతులయ్యారు. ఇప్పటివరకూ అమలాపురం మండల విద్యాశాఖాధికారి–1గా పనిచేస్తున్న సూర్యప్రకాశంకు డీవైఈఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన సూర్యప్రకాశాన్ని డీఈఓ ఎం.కమలకుమారి అభినందించారు. ఆయనను జిల్లా, డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు అమలాపురంలోని డీవైఈఓ కార్యాలయంలో గురువారం కలిసి సత్కరించారు. జిల్లా గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోకా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు గణేశ్వరరావు, కార్యదర్శి పెచ్చెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

తొలి రోజు ఐదు సెట్ల నామినేషన్లు



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎంపీ బోస్

– ఆర్‌ఓ సుధా సాగర్ వెల్లడి

రామచంద్రపురం: నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన తొలిరోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లను ధాఖలు చేసినట్టు రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటరి్నంగ్ అధికారి, ఆర్డీఓ ఎస్ సుధాసాగర్ మీడియాకు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థిగా గుత్తుల జైశ్రీసుర్యేంద్రనాథ్ బాబుజీ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి పిల్లి సూర్యప్రకాశ్ రెండు సెట్లు, పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించినట్టు చెప్పారు. అభ్యర్థులకు ఎన్నికల నియమావళితో కూడిన కిట్లను అందించామన్నారు.

25 వరకు నామినేషన్ల స్వీకరణ

రామచంద్రపురం అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆర్‌ఓ సుధాసాగర్ వెల్లడించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు కావలసిన సమాచారాన్ని అందిస్తామన్నారు. నామినేషన్ పత్రాలను వాటి అనుబంధాలతో సహా తీసుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆర్‌ఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు, ఉదయం 11 గంటల నుంచి నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 25 చివరి తేదీగా స్పష్టం చేశారు. ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన చేస్తామన్నారు. నామినేషన్ ఉపసహరణకు ఈ నెల 29 చివరి తేదీగా పేర్కొన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ముగింపు జూన్ 6తో ముగుస్తుందని తెలిపారు. ఆదివారం 21వ తేదీ ప్రభుత్వ సెలవుదినం కావడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదన్నారు. ఆర్‌ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు ఆంక్షలున్నట్టు చెప్పారు. కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వివరాలకు హెల్ప్ డెస్క్ 08857–245166 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పాలనకే ప్రజా సేవకుల మొగ్గు

- పెద్ద ఎత్తున రాజీనామా చేసిన వలంటీర్లు
- ఇంట్లో ఒకరిగా మారారంటున్న పేదలు
- అక్కసు వెళ్లగక్కుతున్న విపక్షాలపై మండిపాటు
- ప్రతిపక్షాల హామీలపై నమ్మకం లేదంటున్న వలంటీర్లు

కపిలేశ్వరపురం: కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కనిపించే సేవకుడు వలంటీర్. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధాన రూపకల్పనలోని ధీరుడు. సంక్షేమ పాలనలో కార్యశీలి. తెల్లవారుజామునే పేదల ఇంటి తలుపుతట్టి, అవ్వాతాతలు, దివ్యాంగులకు ప్రభుత్వ సాయం రూ.మూడు వేలను చేతికందించే అసలుసిసలు సంక్షేమ సేవకుడు. ఇంతటి ప్రాధాన్యం ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో వలంటీర్లకు విశేష ఆదరణ లభిస్తోంది. ప్రతిపక్ష పార్టీల దుశ్చర్యలతో వలంటీర్లు పేద, మధ్య తరగతి ప్రజలకు తాత్కాలికంగా దూరమయ్యారు.

వలంటీర్లపై అక్కసు

కరోనాను సైతం లెక్కచేయక, ఆర్థిక లోటుపాట్లను ఓర్చి రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుంది. సంక్షేమ పాలనలో అత్యంత కీలకంగా సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు వ్యవహరించాయి. ఎన్నికల వేళ వీరి సేవలు కొనసాగితే తమకు ఓట్లు పడవన్న భయంతో ప్రతిపక్షాలు వలంటీర్లను ప్రజలకు దూరం చేశాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, వలంటీర్ల సేవలకు విఘాతం కలిగించాయి. అంతటితో ఆగకుండా వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వారు విపక్షాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతు

ప్రతిపక్ష పార్టీలు పదే పదే లేనిపోని అపవాదులు వేయటంతో మూకుమ్మడి రాజీనామాలు చేసిన వలంటీర్లు.. సంక్షేమ పాలనకు మద్దతుగా నిలిచారు. దీంతో అవాక్కయిన ప్రతిపక్ష నేత చంద్రబాబు వలంటీర్లను కొనసాగిస్తామని, వారికి రూ.10 వేల నెలసరి ఆర్థిక సాయం అందిస్తామంటూ ప్రకటనలు గుప్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కపట ప్రేమని నమ్మని వలంటీర్లు సంక్షేమ పాలనవైపు ధీటుగా నిలబడుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో అనేక మంది



ఆస్పత్రికెళ్లి పింఛను ఇస్తున్న వలంటీర్ (ఫైల్)



వరదల సమయంలో బాధితుల ఇళ్లకు వాటర్ టిన్ తీసుకెళ్తున్న వలంటీర్

వలంటీర్లు రాజీనామాలను చేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బహిరంగంగానే మద్దతు తెలిపారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో ఒకేసారి 1,200 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారికి అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ నేతల భరోసా

వలంటీర్ల సేవలు ఆగవంటూ ఈ నెల 4న నాయుడుపేట బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. అదే ఒరవడిలో ప్రతిపక్షాల కుట్రకు ఆందోళన చెందవద్దంటూ నియోజకవర్గ స్థాయిలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు, నాయకులు వలంటీర్లకు భరోసా ఇస్తున్నారు. త్వరలో సంక్షేమ పాలన మరోసారి ప్రజల ముందుకు వస్తుందని, సేవకులు సిద్ధంగా ఉండాలంటూ వలంటీర్లకు ధైర్యమిస్తున్నారు.

పక్కాగా పింఛన్ల పంపిణీ

ఏప్రిల్ నెల పింఛన్లను ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల్లో పక్కాగా లబ్ధిదారులకు అందించింది. ఈ నేపథ్యంలోనే వలంటీర్ సేవలకు అవాంతరాలను సృష్టించాలనుకునే ప్రతిపక్షాలకు సరైన సమాధానం చెప్పినట్టయింది. ఈ నెల 4న ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా 65,69,904 మంది లబ్ధిదారులకు రూ.1,951.69 కోట్ల విలువైన పింఛన్లను అందజేశారు. కోర్టు తీర్పును గౌరవిస్తూ సచివాలయ ఉద్యోగులతో పింఛన్లను పంపిణీ చేశారు. అందుకు ప్రభుత్వం విడుదల చేసిన నూతన మార్గదర్శకాలు ఫలించాయి. కదల్లేని, మంచం పట్టిన లబ్ధిదారులకు ఇంటికెళ్లి పింఛనును అందజేశారు.

నా జీవితం ధన్యమైంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి సేవలందిస్తున్నాను. ఆయన పాలనలో మంచి పేరు తెచ్చుకున్నాను. వరదల సమయంలో ఇంటింటికీ వాటర్ టిన్లను పట్టుకెళ్లి ఇచ్చాను. ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నాను. అలాంటి మమ్మల్ని అనరాని మాటలను అనడానికి ప్రతిపక్షాల వారికి నోరెలా వచ్చిందో అర్థం కావడం లేదు. సంక్షేమ పాలనకు మద్దతుగా రాజీనామా చేశాను. – కాశిన రమేష్, రాజీనామా చేసిన వలంటీర్, కేదారిలంక

రౌడీ షీటర్ల బైండోవర్

మండపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రౌడీ షీటర్లపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు మండపేట సీఐ షేక్ అఖిల్‌జమ గురువారం తెలిపారు. మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 మంది రౌడీ షీటర్లను 151 సీఆర్‌పీసీ కింద బైండోవర్ చేసినట్టు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ముందు జాగ్రత్తగా వారిని బైండోవర్ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరగాళ్లపై నిఘా ఉందన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిమాపక యంత్రం పనిచేసే విధానాన్ని వివరిస్తున్న అధికారులు

మండపేట: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపకాధికారి హనుమంతరావు అన్నారు. అగ్నిమాపక భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలి, నివారణకు పాటించాల్సిన జాగ్రతలను వివరించారు. ప్రమాదం జరగ్గానే వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఏజీఎం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లోని సచివాలయాల్లో గురువారం ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నోటిఫికేషన్ వివరాలను ఓటర్లకు అందుబాటులో ఉంచారు. ఎంపీడీఓ కొండలరావు, తహసీల్దార్ రాజరాజేశ్వరి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా భీమేశ్వరాలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో ఉన్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉండి వీరభద్రశర్మ పూజాది కార్యక్రమాలు చేశారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మండపేట: లైన్ల నిర్వహణ కోసం ఏడిదలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ వై.విజయానంద్ తెలిపారు. ఏడిద, సీతానగరం, సావరం, కొత్తూరుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కపిలేశ్వరపురం: వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం వైద్య, ఆరోగ్య కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేశారు.

కాపు ఆత్మీయ సమావేశం

మండపేట: నియోజకవర్గ కాపు ఆత్మీయ సమావేశం గురువారం స్థానిక సూర్యా కన్వెన్షన్ హాలులో జరిగింది. కాపు నాయకుడు వుంగరాల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ల జోగేశ్వరరావు, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.